# వి.వి.ఎమ్. స్కూల్

స్థలం: వెలుగుపల్లి వెంకాయమ్మ మెమోరియల్ స్కూల్ బైట.

సమయం: మధ్యాహ్నం ఒంటిగంట- అంటే... ఇంట్రవెల్ టైము-

విషయం: పిల్లలందరూ అన్నాలు తినే సందడి!

పిల్లలందరూ అన్నాలు తింటున్నారు.

వాళ్ళ అమ్మలు వచ్చి తినిపిస్తున్నారు. ముఖ్యంగా ఈ హడావుడి అంతా ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిల్లోనే.

పెద్ద క్లాసుల వాళ్లు స్కూలు మెట్ల దగ్గర్నుంచి వరండాలూ, క్లాసు రూమ్‌లూ... ఎక్కడో అక్కడ టిఫెన్ బాక్స్‌లు ఓపెన్ చేసుకుని తింటారు. అమ్మలు వచ్చి మాత్రం స్కూల్ ఆవరణలో చెట్లకింద నిండి వున్నారు.

అక్కడో రావిచెట్టు కిందో 'ఆయా' పిల్లల కోడిలా కూచుని వుంది. తన చుట్టూ ఉన్న ఐదారుగురు పిల్లలకి తను తెచ్చుకున్న కేరేజీలోంచి అన్నం పంచి పెడుతోంది.

ఆవిడ తెచ్చుకునే టిఫెన్ బాక్స్‌లో అన్నం అచ్చంగా పిల్లలు తినేదే- టమాటా- కేరెట్- పప్పూ కొంత ఉప్పూ కలిపి మెత్తగా వండి తెచ్చుకుం టుంది- కాదు... తెస్తుంది.

65 ఏళ్ల ఆయా ఉప్పూ పులుపూ కారం తినే ఆరోగ్యంలో వున్నా ఆవిడ మాత్రం మధ్యాహ్నం లంచ్ బాక్స్ ఇలాగే తెచ్చుకుంటుంది!!

ఇప్పుడు... రోజూలాగే అన్నం తెచ్చుకున్న ఆయా, అమ్మ రావడం ఆలస్యం అయిన పిల్లలకి అన్నం పంచి పెడుతోంది!

✦ ✦ ✦

స్థలం: ఒక రోడ్.

సమయం: లంచ్ టైమ్.

విషయం: ట్రాఫిక్‌లో చిక్కున్న వైష్ణవి తల్లి సుశీల ఆవేదన.

ఇప్పటికి ఇన్‌టరిమ్ బెల్ కొట్టేసి పావుగంట దాటి ఉంటుంది- టెన్షన్ పెరుగుతోంది సుశీలకి. ఈపాటికి 'వైష్ణవి' గేట్ దగ్గరకొచ్చి మమ్మీ

ఇంకా రాలేదని చూస్తూ వుంటుంది! మళ్లీ టైమ్ చూసుకుంది.

ఒంటిగంటా నలభై మూడు నిముషాలు-

సుశీల ఏం చేయగలదు- ట్రాఫిక్ అంతా జామ్. ఆ రోజు సెంట్రల్ మినిస్టర్ వస్తున్నాడని... ఎట్నుంచి ఎటు మార్చారో తెలియని రూట్లో అధ్వాన్నస్థితిలో వుంది ఆ మధ్యాహ్నం లంచ్ అవర్!

సుశీలకి దారి దొరక్క- దొరికిన దారిలో వాహనాలు వెళ్లలేక... టెన్షన్ పడిపోతోంది- ఆయా ఉంటుందనీ... అన్నం పెడుతుందనీ సుశీలకి తెల్సు.

కానీ తల్లి ప్రాణం తహతహలాడుతోంది. సారీ వైష్ణవీ- అనుకుంటూ, వచ్చే మినిస్టర్నీ, ట్రాఫిక్ మేనేజ్ చేసిన వాళ్లని తిట్టుకుంటోంది సుశీల!

టైము తిరుగుతోంది- సుశీల ఎలాగో... పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్‌ని ఛేదించుకుని... స్కూల్ ముందు తన కెనటిక్‌ని పార్క్ చేసింది. మళ్లీ బెల్ మోగటానికి ఇంకెంతో టైమ్ లేదు. పరిగెడుతూ లోపలికి వెళ్లింది. పాపలందరూ అమ్మలకి బైబైలు చెప్తున్నారు. కొందరు తల్లితో వెళ్లిపోవడానికి మారాము చేస్తున్నారు.

సుశీల పరుగు ఆగింది.

ఆయా... వైష్ణవి మూతి కడుగుతోంది.

ఒక్కక్షణం టెన్షన్ పోయింది. అంటే వైష్ణవి లంచ్ అయింది.

ఇప్పుడు తను కనిపిస్తే మళ్లీ ఏడుపు.

కథ మొదటికొస్తుంది. అమ్మ తన ఆత్రాన్ని అణుచుకుని...

చాటున దాక్కుంది.

వైష్ణవి ఆయమ్మని ముద్దు పెట్టుకుంది. ఆయమ్మ వైష్ణవిని అమ్మలా కావిలించుకుంది.

టంగ్... టంగ్... టంగ్- మళ్లీ క్లాసులోకి రమ్మని పిలుపు బెల్ మోగింది.

వైష్ణవి పరుగు పెట్టింది క్లాసులోకి!

సుశీలకి కళ్లు చెమ్మగిల్లాయి. తనని పట్టించుకోలేదని! తను పాపకి కనపడకుండా క్లాసులోకి పంపాలని ఆగిందా... మరి తను కనపడలేదని పాప ఎందుకేడ్వాలి?

ఆ ఇంగితం సుశీలకి లేదు.

కళ్లనీళ్లు సుళ్లు తిరుగుతుండగా-

"థేంక్యూ ఆయమ్మా- వచ్చే దారంతా మారింది. నువ్వేదో మరిపించి తినిపించావు గనక కానీ..."

ఆపైన గొంతు పూడుకుపోయి... ఏమీ చెప్పలేకపోతోంది.

"నాకు ఇలా... రోజుకో తల్లైనా... థేంక్స్ చెప్తుంది తల్లీ! వాళ్లకి నేను చెప్పేమాట ఒకటే- నా మనవరాలికి అన్నం పెడ్తుంటే... నా కూతురో కోడలో వచ్చి థేంక్స్ చెప్పాలా? కాదు! ఇది... నా బాధ్యత"

చివరి మాటలు అంటోంటే ఆయమ్మ కంఠం వణికింది, కళ్లూ తడిబారాయి. సుశీల మౌనం వేల ప్రశ్నలు వేసింది.

ఆయమ్మ చెప్పిన సమాధానం పేరు మోసిన కథా రచయిత్రి అయిన సుశీలకి గొప్ప కథగా తోచింది- ఊహకందని కథలు జీవితాల్లో

ఉంటాయని గుండె చెమ్మగిల్లి ఇంటికొచ్చింది.

✦ ✦ ✦

సమయం: రాత్రి పదకొండు.

స్థలం: సుశీల రైటింగ్ రూమ్

విషయం: ఆయమ్మ కథ రాస్తోంది సుశీల.

నిజానికా కథ సుశీల రచించట్లేదు.

ఆమె చెప్పిన కథనే యథాతథంగా రాస్తోంది.

ఆయా అసలు పేరు ఆయా కాదు- వెంకాయమ్మ.

ఆ స్కూల్ పేరు వెంకాయమ్మ మెమోరియల్ స్కూల్!

బతికుండగా 'మెమోరియల్' అని ఎవరైనా పేరు పెట్టుకుంటారా అనుకోవచ్చు- కానీ అది ఆయా వెంకాయమ్మ స్థాపించిన స్కూలే- అది కచ్చితంగా మెమోరియల్ స్కూలే.

వెంకాయమ్మ కొడుకు శ్రీకాంత్ తన కూతురికి అదే పేరు పెట్టాడు.

"ఒరేయ్ నా పేరు బాగోదురా... కొంచెం కొత్త పేరు పెట్టరా" అని మనస్ఫూర్తిగా వాదించింది వెంకాయమ్మ.

"నో! మమ్మీ అలాగే పెడతాను" అని తల్లి పేరు పెట్టుకున్నాడు బుజ్జిపాపకి!

వద్దన్నా అమ్మగా పొందే ఆనందం ఎంతో... వెంకాయమ్మకి!

బుజ్జి వెంకాయమ్మకి మూడు ఏళ్లు దాటాయి.

ఓ గుళ్లో అక్షరాభ్యాసం చేసి, ప్లేస్కూల్లో ఎల్.కే.జిలో పడేయాలని అందర్లాగే అనుకున్నారు శ్రీకాంత్, భార్య.

గుడికి బైల్దేరారు సొంత కారులో- అక్షరాభ్యాసం అయ్యింది.

పాడు లారీ గుద్దింది మధ్యదారిలో.

అందరూ పోయారు- మిగిలింది... ఒక్కతే ముసలి వెంకాయమ్మ!

ముసలి వెంకాయమ్మకి మిగిలింది ఏమిటి?

లక్షల ఆస్తులు!

అందుకే ఈ విద్యా సంస్థ స్థాపించింది.

తనో ఛైర్మన్‌గానో ప్రిన్సిపాల్‌గానో వుండే విద్యార్హత విజ్ఞానం ఉన్నా... ఆమె తన మనవరాలి వయసున్న పిల్లలకి అన్నం తినిపించడానికి, ఆత్మీయత పంచడానికి ఆయాగా ఉంటుంది!

ఆ స్కూల్ ఆవిడదే- ఆ బిల్డింగ్ ఓనరూ ఆవిడే... కానీ... ఆయమ్మగానే వుండదల్చుకుందంతే...

ఈ కథకి ముగింపు ఏం రాద్దాం-

సుశీల తెగ మథన పడుతోంది.

నో- ముగింపు వద్దు- అనుకుని అరవై ఐదేళ్ల వెంకాయమ్మ దగ్గరే.. కథ కొనసాగిద్దామనుకుని, పెన్ను మూసి ఆగింది... ఫేమస్ రైటర్ సుశీల!

ఇందులో ఆవిడ కల్పితం ఒక్క అక్షరం కూడా జొరపడకూడదని అనుకుని రాసింది.... ఆ ఆయమ్మా కాంక్ష... జీవితం అలాగే సాగుతుందని నమ్మకంగా కథ ముగించింది!

